# పొలిట్రిక్సు కథ

"ఆయమ్మడు నెమ్మదైనపిల్లే. వినయం, వొందనం, శాంతం..." అన్నారు రామిరెడ్డిగారు—సుబ్బరాజు రాగానే.

సుబ్బరాజు తలొంచుకున్నాడు. ఈ విషయాల గురించి పబ్లిక్కున మాట్లాడడం అతనికిష్టంలేదు. "కనుక్కున్నాను. మీరు రాస్తున్నారన్న పోస్టర్లు ఎగస్పార్టీ వోళ్ళే వేయించారట" అన్నాడు.

"మరేట. నా బొమ్మేసినాయ నొచ్చాడిటేపు. బొమ్మ బాగుందయ్యా అంటే, "మీ ముక్కూ మూతీ అంత సోగ్గా ఉన్నాయియ్యా, నా గొప్పేంవుంది. మీది బొమ్మలేసే వోళ్ళు చూసి మురిసి పోయే ముఖవూ" అన్నాడు. నివ్వు నన్ను పొగడతన్నట్టా తెగడతన్నట్టా అనడిగేశా న్నవ్వుతూ. "నా మాటబద్ధ వైతే, ఎలకను కెక్కండి, మీ మొఖం జూసి సీటివ్వకపోతే ఒట్టూ" అన్నాడు. నవుతాలుగాదు, సుబ్బరాజూ, నీకా సుబ్బరాజుగారబ్బాయికతదెలీదుగావోసు.

"నీ పేరుగలాడి కతని, అది నీ మీజ్జెప్పాననుకొని బుజా ల్తడూకునేవు, జాగ్రత్త. బుజా ల్తడుంకోడం గొప్పోళ్ళ లక్షణంకాదు. గుమ్మడికాయలు ఎత్తు కొచ్చినా బుజా ల్తడువుకోకూడదు గుమ్మడికాయలు పోయాయంటే నివ్వెత్తు కొచ్చినవే అని దాఖలా ఎక్కడ? ఏం గుమ్మడో-బూడిద గుమ్మడో, పండు గుమ్మడో. ఈ ఊరియో, దేశాంత్రం లోవో, ఇప్పటిమాటో, ఎప్పటిమాటో- ఎవడికి దెల్సు? అంచే తలా కంగారు పడకూడదు. పౌరుషం దెచ్చుకోకూడదు. నీతి నిజాయితీలమీదా, వాటి వెతిరేకాల మీదా ఎవరెంత వుపన్యాసా లిచ్చినా సుబ్బరాజుగారు బుజా ల్తడూకోలేదు. పైగా ఆయనే ఎన్నో లెక్చర్లిచ్చాడు. సుబ్బ రాజుగారలాటిలాటో డనుకునేవు. లక్షలు గడించాడు. కోటికి పడగెత్తేవోడే గాని, ఇన్‌కంటాక్సువాళ్లేడిచిపోతారని మానే శాడు. అసలదీగాక, ఆయనకి టాక్సెం దుకు? ఇన్‌కంటాక్సు బాబులాటి కొడు కున్నాడు. ఓమాటా యబ్బాయి గుర్రవంత పెంపుడు కుక్క నేసుకుని ఊటీ రైలు కెళ్ళి ఏర్కండిషనింగు పెట్టెలో కెక్కాడు. అందులోఉన్న ఇంకో గొప్పాసామి ఝుడుసుకుని గార్డుకి ఫిర్యాజ్జేశాడు. ఆఫీసరూ, గార్డూ వచ్చి కుక్కని దింపేయ మన్నారు. కుక్కల పెట్లోకి ఎక్కించ మన్నారు. కుర్రాయన మండిపడ్డాడు. దీన్ని కుక్కంటావేటి? నీకేమన్నా బుర్రుందా, అన్నాడు. "మీ యిద్దరి

ముళ్లపూడి వెంకటరమణ

జీతాలూ కలిపినా, దీనికయ్యే నెలసరి ఖర్చులో సగవుండ తెలుసా" అన్నాడు.


"మే మిద్దరం ఊరెళ్తే ఓ పెట్టె కేటాయింపుగా దీసుకుంటాం మరి. మీ కుక్కకి అలా ఓటి బుక్ చేసుకోండి కావలిస్తే" అన్నాడు ఆఫీసరు కోపంగా.

"సరే. అలాగే కానీ, నాకేం బయవా?" అని రైలు దిగిపోయాడు కుర్రాయన.

వారం తరువాత కుక్కకీ, తనకీ ఎన్నాండలో పారేసి ప్రత్యేకం ఓ ఏర్కండిషన్ పెట్టె కట్టించుకెళ్ళాడు. అద్గదీ, పౌరుషం అంటే అలాగుండాలి. దరిమిలాను ఊళ్లో అంతా గొప్పగా ఇెప్పుకున్నారు దీన్నిగురుంచి. పేపరాళ్లు ఫొటో గట్రావేసి రాస్తామని సరదాపడ్డారు గాని, సుబ్బరాజుగారే వద్దన్నారు—అ. యీ చిన్నదానికి పెద్ద పబ్లిసిటీ ఎందుకు లెండి అని. కొడుకు ప్రెగ్నెకి పొంగి పోయినా, ఆయనకి గుబులు పట్టుకుంది. వీడిలా గుణించేస్తే ఎన్నాళ్ళాటొస్తాము? దీనికి తగ్గట్టు గణించాలి గామోసు! అని. ఓ మాటు ఎవరో సభలో అవినీతి గురించి ఘాటుగా మాటాడుతూంటే, ఎందుకో ఎన్నడూలేంది మనసు చివుక్కు మంది. తిరపతెళ్ళొచ్చినా స్తిమితపడలేదు. డబ్బు తరిగిపోతోందా ఏమిటి, చెప్మా అని అప్పుడు అనుమానం తగిలింది. తనికీ చేసుకున్నాడు. మేనేజర్లూ, వాళ్ళ కుడిభుజాలూ సబబుగా కాజెయ్యాల్సిన దానికి పదింతలు బయటికి రవాణా చేసుకుపోతున్నారు. ఒక్కనెలలో వాళ్ళు తీసుకున్న అదనపు డబ్బు ఆ నెల్లో వాళ్లు పట్టుకున్న చిన్న కైంకర్యాలకి పదింతలుంది. తన వాటాకి రెండింత లుంది. సుబ్బరాజుగారికి గుండెబేజారయి పోయింది. గట్టిగా అడిగేందుకు లేదు. "ఈసారి షేరుహోల్డర్ల మీటింగవనీ, మీ పని చెప్తా" అని ఒట్టేసుకున్నాడు. నెమ్మదిగా తన కొడుకుల్ని బిజినెసులో పెట్టాలని నిశ్చయించుకున్నాడు. ఆయనకి వారసులయిన కొడుకులు ముగ్గురే. బే వారసులందరికీ, అక్కడ అక్కడా ఉద్యోగా లేయించేశాడు.

సుబ్బరాజుగారికో ముచ్చటుంది. ఒక్క కొడుకుని రాజకీయాల్లో దింపుతే, ఒకడు వ్యాపారం గణిస్తే, మూడోవాడు కుక్కల్నీ గుర్రాల్నీ ఏర్కండిషండు పెట్టెల్లో, విమానాల్లో తిప్పి గుణించినా ఫరవాలేదు. ముగ్గురిలో ఎవరెందుకు పని కొస్తారో తేలాలి. ఆయనకి ఇతరత్రా అంగబలం లేదనికాదు. రెండు మూడు రేసు గుర్రాలూ, రెండు పార్టీల నాయకులూ, రెండు యూనియనుల హీరోలూ పార్టీలో రెండుగ్రూపుల పెద్దతలలూ, రెండు మూడు ఫిలిం కంపెనీల్లో పెద్ద షేర్లూ తన పేరుమీదుండి ఇతర్ల హయాములో తిరుగుతున్న పది పదిహేను కార్లూ లేకపోలేదు.

ఓసారి పార్టీమీటింగులో ఓ ఎలక్షనుకి అభ్యర్థుల్ని సెలక్టుచేసి టిక్కెట్లిస్తుండగా




ఆయనకి తనకొడుకొకణ్ని దింపాలని మనసైంది. టిక్కెట్లరద్దీ ఎక్కువగా ఉంది. అందరికందరూ గొప్పవాళ్ళేననీ ఏ ఒకరు లేకపోయినా దేశం నాశనం అయిపోతుందనీ అందరూ అన్నారు. అవతల సంస్థలో సీట్లు పెంచేసి అందరికీ టిక్కెట్లిద్దామాఅంటే అందుకు వ్యవధి లేదు రాజ్యాంగాన్ని సవరించాల్సి రావచ్చు. అవి నెమ్మదిమీద జరిగేవి. చివరకి మూడు సీట్లకి టిక్కెట్ల దగ్గర శానా రభసైంది. పద్దెనమండుగురు అడుగుతున్నారు.

"రావుగ రిముక్కు చాలా పొడుగు. మొహం తమాషాగా ఉంటుంది. జనం ఓసారి చూస్తే మళ్ళీ మర్చిపోరు. ఇలాటి ముఖాన్ని ఎక్కువ ప్రేమించెదరు. కార్టూన్‌లు వెయ్యడం సులువు. ఎంత చేతగానివాడైనా ఇట్టేపోలిక లొచ్చేలా వేస్తాడు. అంచేత యీయన కార్టూనులు తరుచు పేపర్లలో పడితే, పార్టీకి నిత్య పబ్లిసిటీ అందువల్ల పార్టీ మేలు, దేశమ్మేలు కోరి రావుగారికే ఈ టిక్కెట్టు ఇవ్వా"లని ఆయన తరఫు వకీలు రెడ్డిగారు వాదించాడు. ఆ సీటుకి పోటీ చేసేవారిలో ఈ క్వాలిఫికేషను ఇంకెవరికీ లేనందువల్ల ఇది ఆయనకే ఇచ్చారు.

మరోదానికి ఇలాటిదే వచ్చింది. మా రెడ్డిగారి ఆరోగ్యం బాగులేదు ఎప్పుడూ పాలిటిక్సు సందడి, సమస్యలు ప్రజాసేవ ఉండాలి. లేకపోతే మనసు, ఆరోగ్యం నాశం అయిపోతాయి. అలాని డాక్టరు సర్టిఫికెట్టు కూడా ఉంది -పైన మీ ఇష్టం. ఒక మహనీయుణ్ణి చేజేతులా పోగొట్టుకుంటామంటే... మీ యిష్టం అన్నాడు రావుగారు. ప్రాణంతో చెలగాటాలాడరాదని, ఆ సీటు ఆయనకిచ్చారు.

"పార్టీకి, దేశానికి, ముఖ్యంగా పేపర్లో పబ్లిసిటీ వస్తువుకీ రావుగారి కార్టూను

ఫేసు, రెడ్డిగారి అనారోగ్యం ఎంత ముఖ్యమో, మా రాజుగారి ఉపన్యాసాలూ, స్టేటుమెంట్లూ అంత ముఖ్యం అని మీరు మర్చిపోతున్నారు. ఆయన ఏంమాటాడినా మర్నాడు పేపర్లో సంపాదకీయం, నాలుగింట మూడుపాళ్ళు కార్టూను వస్తాయి. జనం చర్చిస్తారు. చర్చలే దేశానికి జీవం. అదే రాజకీయ చైతన్యం. జనంలో ఆ చైతన్యం వుంటేనే దేశం బాగుపడుతుంది. అంచేత...నే చెప్పడం ఎందుకు? మీకే తెలుసు. అదీగాక, రాజావారు పాలిట్రిక్సుతప్ప ఇంకేది చెయ్యరు, చెయ్యలేరు ఆపైన మీ యిష్టం" అని తన ప్రాంతపు మండలి తీర్మానాన్ని చదివాడు రెడ్డిగారు. ఆసీటు ఆయన కివ్వడంతో సుబ్బరాజుగారి మనసులో ఆలోచనలు రేకెత్తాయి.

మనవెధవాయలు ముగ్గురిలో ఇలాటి అర్హతలు ఏమున్నాయీ అని తర్కించుకున్నాడు. వాళ్ళ మొహాలే గుర్తుకురాలేదు. కనబడిచావరుగదా? పదేసేళ్ళుండగా, బాగా దగ్గర్నించి తీరిగ్గా చూశాడు. అవే ముఖాలు మనస్సులో మెదిలాయి ఆ ముఖాలికే మీసాలుపెట్టి ఊహిస్తే రావుగారి కార్టూనుఫేసుల్లా కనిపించాయి. ఛ, ఇదిగాదుపనని సెక్రట్రీకి చెప్పాడు_ వాళ్ళ ముగ్గుర్నీ ఓసారి కేకేయించండని. ట్రంకుఫోన్లు, టెలిగ్రాములు, కేబుల్ గ్రామూ ఇచ్చి వారంరోజుల్లో వాళ్ళని రప్పించి మీటింగు వేయించాడు సెక్రట్రీగారు.

కొడుకులు ముగ్గురూ వినయంగా కూర్చున్నారు తన మనసులో మెదుల్తున్న పదేళ్ళపిల్లల మొఖాలికి ఈ పాతిక ముప్ఫయేళ్ళ వాటికీ వాలకంలో అస్సే తేడా కనబడలేదు.

గుమాస్తాలదగ్గర మాటాడినంత బింకంగా, బోనసు ఇంక్రిమెంట్లు డిమాండ్లకి చెప్పే జవాబులా, టూకీగా సంగతిచెప్పాడు సుబ్బరాజుగారు. "అబ్బాయిలూ, ఇది కాశీ మజిలీ కథలావుంటే ఉండవచ్చుగాని మీకో చిన్నపన్జెబుతాను. చెయ్యండి. ముగ్గురూ దేశంమీదకెళ్ళి పరిస్థితులు చూసిరండి మిమ్మల్ని పాలిటిక్సులో దింపదలుచుకున్నాను. అంచేత దేశం చూసి మీ అభిప్రాయాలు చెప్పండి. బద్ధకించినా, ఎగేసినా, దగా చేసినా నా ఆస్తిలో చిల్లుకానీ ఇవ్వను. ఇన్కం టాక్సు కట్టిపారేస్తా జాగర్త" అన్నాడు ముక్తసరిగా.

మూడోకొడుకు ధైర్యంగా ఏదో చెప్పబోయాడు. ''చిల్లుకానీ ఇవ్వద్దుగాని ఓసారి చూపిస్తారా? దానికి చిన్నబెజ్జం ఉంటుందని నేనూ, కాదు పెద్దదని నా మిత్రుడూ వాదించుకుంటున్నాం. మీరెవరితో ఏకీభవి..."

తండ్రిమాపుజూసి అది వాయిదా వేసుకున్నాడు.

"మూణ్ణెల్లు గడువు" అని కేకేశాడు తండ్రి, కొడుకులు గుమ్మం దాటుతూండగా.

''మూణ్ణెల్లు తిరిగి గడువు ముగిసే సరికి గడపలోవాలారు ముగ్గురూ. తండ్రి ముగ్గుర్నీ మూడుగదుల్లో కూచోబెట్టి, ఒక్కొక్కడినీ పిలిపించాడు.

పెద్దకొడుకు ముందువచ్చాడు. మొహం దిగాలుగాఉంది. బట్టలు మాసివున్నాయి. వాటికన్నా గడ్డం మరింత మాసింది. దైన్యంచూసి కడుపు తరుక్కుపోయింది తండ్రికి.

''తలనొప్పిగా ఉందా ?'' అన్నాడు.

''హాఁ. తలేమిటి, జీవితమే నెప్పెడుతోంది'' అన్నాడు కొడుకు—గాఢంగా నిట్టూర్చి సోఫాలో కూలబడుతూ.

''సంగతేమిటి ? ఏమైంది?'' అన్నాడు తండ్రి ఆదుర్దాగా.

''నాన్నా. లాభం లేదు. మనంకాదు దేవుడైనా సరే పాల్టిక్సులోకెక్కి ఎంత తిప్పలుపడ్డా లాభంలేదు. దేశం అలా ఉంది. కళ్ళారా చూశాను చెవులారా విన్నాను. ప్రజలు చాలామందికి రెండు కార్లుకూడలేవు ఉన్నా చిన్నకార్లు చాల మందికి అవీలేవు ఇంకా కొందరున్నారు. వాళ్ళకసలు ఏమీలేదు, చదువులేదు, తిండిలేదు, హెల్తులేదు, వెల్తులేదు. మరొక వంక అవినీతి, లంచగొండితనం ఒగా, మోసం, బద్ధకం. పనిమాలిన తనం, పనికిమాలిన తనం, జబ్బులు, చావులు ముమ్మరంగా ఉన్నాయి అమ్మొబాబోయ్! వీళ్ళందరినీ బాగుచెయ్యాలంటే మధ్య వాళ్ళందర్నీ అదుపు చెయ్యాలంటే బ్రహ్మతరంకాదు ఎవరు చెయ్యగలిగింది ఏమీలేదు. అది మహా ప్రవాహం. అందు మీద కొట్టుకుపోతూ, దాన్ని మనం నడపుతున్నామని భ్రమపడడం తప్ప మరేంలేదు. లాభంలేదు నాన్నా లాభం లేదు'' అన్నాడు.

తండ్రి జాలిగా అతనికేసి చూశాడు. ''పో. పోయి స్నానంచేసి భోంచేసిపడుకో. డాక్టర్ని పంపిస్తాను- మందు తిందువు గాని. భయపడకు'' అని సాగనంపి బెల్లు నొక్కాడు.

''నాన్నా, ఘోరం! ఘోరం! ఇన్నాళ్ళూ మమ్మల్ని సుఖాలమధ్య పెట్టి, చుట్టూరా డబ్బుగోడలు కట్టి సమాధి చేశావు. అర్జెంటు, అర్జెంటుగా నేను జీవితంలో అడుగుపెడతాను'' అంటూ గాలిదుమారంలా వచ్చాడు రెండో కొడుకు.

''కూర్చో. కూర్చో. కూర్చుని స్థిమితంగా చెప్పు'' అన్నాడు తండ్రి కంగారుగా, ఆశ్చర్యంగా.

''చెప్పేందుకు టైములేదు, నాన్నా. పత్రికల రంగు టద్దాలలోంచి, స్వార్థపు చత్వారపు కళ్ళతో దేశాన్ని చూస్తున్న నీకేం తెలుస్తుంది, టైము విలువ? నేను ఒక్కక్షణం ఆగలేను దేశం గగ్గోలుగా ఉంది. లక్షలాదిజనం బాధపడుతున్నారు. తిండి తిప్పలయిపోయింది మందుమాసి కాని కందుతోంది. ఇంపోర్టు పాలిసీ బాగులేదు. కారు అడిగిన రెండేళ్ళగ్గాని

రాదు. పన్జేసే రేడియో బోల్డుఖరీదు. బీదవాళ్ళు బీద బాధలూ గొప్పవాళ్ళు గొప్ప బాధలూ పడుతున్నారు. దేశంలో కోడిగుడ్లు శాకాహారం స్థాయికి, పూజరోజు కాఫీ ఔషధం హోదాకి పెరిగినట్టు లంచ గొండితనం వంటి అవినీతి పనులన్నీ ఇవి నీతి పనులన్న జాబితాలకి ఎగ బాకి పోయాయి. నీతిని గొంగళీ పురుగుల్లా తినేస్తున్నాయి. ఇంకాసిని రోజులుపోతే అవే సీతాకోకలై ఎగిరి విహరిస్తాయి సుమా. ఇవి ఇలా రివాజైపోతే — తర వాత్తరవాత అవినీతి పనులింక లాభసాటి కావు — కొత్తకొత్త తప్పుడు పద్ధతులూ, పాడుపనులూ కొత్త దగాలూ కనిపెట్టాలి నాన్నా, పన్నులు ఎగెయ్యడం గౌరవం అయిన పని. సేల్సుటాక్సు వసూలుచేసి పెడుతున్నవాళ్ళని గవర్నమెంటు పద్దు లడుగడం నేరం. నో, ఫాదర్. నేను వెంటనే పాలిటిక్సులో దిగుతున్నాను. మై కంట్రీ నీడ్స్ మీ నా దేశం నన్ను పిలుస్తోంది.''

''నువ్వోళ్ళ రెండుగ్లాసులు మజ్జిగతాగి పడుకో'' అని అతన్ని పంపించి, వెంటనే సెక్రటరీని కేకేసి వాడు పడుకోగానే గదికి తాళంవేసు తనచేతికివ్వమని ఆజ్ఞా పించాడు.

మూడోకొడుకు దర్జాగా వచ్చాడు. సమానఫాయామనిషిలా వచ్చాడు. ఎదు రుగా కూర్చుని, సిగరెట్టు ముట్టించాడు. పొగరుగా పొగవదుల్తూ, ''ఊఁ ఏవిటి విశేషాలు నాన్నగారూ? మీ ఆరోగ్యం బాగుందా? మొన్న ఫోంచెయ్యలేదట. ఎన్నో మైసిన్ ఇంజక్షనులు తీసుకున్నా రుట. మీరీస్థితిలో వర్రీకావడం నాకిష్టం లేదు. కొడైలో కాటేజి రెడీచేయించాను నాలుగు నెల్లు రెస్టుతీసుకోండి. ఎలక్షను టైముకొద్దురుగాని. ఆమేనేజరుకి చెక్కుల మీద సంతకంపెట్టే అథారిటీ తీసెయ్యండి. నేజూసుకుంటాను?'' అన్నాడు.

''ఎలక్షనకా? నువ్వు నిలబడదామను కుంటున్నావా?'' అన్నాడు సుబ్బరాజు గారు — బేజారైపోయిన గుండెల్ని మెల్లగా దిటవుచేసుకుని. 'నాచురల్లీ' అన్నాడు కొడుకు సిగరెట్టు ముట్టిస్తూ.

తండ్రి విచిత్రంగాచూశాడు కొడుకు కేసి.

''నాన్నా, నేను ఎక్కువమాట్లాడి మన టైము వేస్టుచెయ్యను. మెడమీద బుర్ర, ఊరిమీద పరపతి బిజినేసూ, డబ్బూ, టాక్సూ అన్నయ్యల్లాటి కొడు కులూఉన్నవాడెవడైనాసరే పాలిటిక్సులో దిగకమానడు. వ్యాపార దక్షతగల వాడెవడైనాసరే, దేశం పరిస్థితి ఇలా వుండగా చూస్తూ కూర్చోడు. మీరు ఏఫీల్డు తీసుకోండి. బిజినెస్ పొటెన్షల్ ఎంతుందో నే చెప్పలేను. వెధవటాక్సు లకి భయపడి వ్యాపారం చంపుకోడం, కాటేజిండస్ట్రీసుతో కాలక్షేపం చెయ్యటం తెలివితక్కువతనం. మీరు కోడై వెళ్ళండి

లేదా కాశ్మీరు వెళ్ళండి. నేను చక్కబెడ తాను అన్నీ'' అన్నాడు కొడుకు.

టెలిఫోను మోగింది. సుబ్బారాజు గారి కాలికింద మీటనొక్కితే అదలా ఆపద్ధార్మంగా మోగుతుంది. "హలో—" అని, అరనిమిషం విని, "నువ్వోళ్ళు మళ్ళీ కలుసుకుందాం. ఇండియాలోనే ఉండు సుమీ. పనుంది" అనిచెప్పి కొడుకును సాగనంపి, నిట్టూర్చి వెనక్కి జేరగిలబడ్డాడు.

* * *

సుబ్బరాజూ, ఇపుడుచెప్పు కథలో సుబ్బరాజుగారేం చేశాడు. ముగ్గురిలోనూ రాజకీయాల కెవర్నెన్నుకున్నారు? అన్నాడు రామిరెడ్డిగారు కథ ఆపి.

''చెబుతా, ముందరాయన సెక్రటరీని పిలిచి తన వయస్సెంతో చెప్పమని ఉంటాడు. తరవాత జ్యోతిష్కుణ్ణిపిలిచి ఇంకా ఇరవై ఏళ్ల ఆయుర్దాయం ఉందనీ ఆరోగ్యం బ్రహ్మాండంగా ఉందనీ చెప్పించుకుంటాడు. ఒకటో కొడుకుని టానిక్కుల డాక్టరుకీ రెండోవాణ్ణి సైకాలజీ డాక్టరుకీ ఒప్పజెప్పుంటాడు వాళ్ళిద్దరూ పాల్టిక్సుకి పనికిరారు. ఒకడ దేశంచూసి బాబోయ్, మనమేమీ చెయ లేము అనేశాడు. రెండోవాడు నేనుచాల చెయ్యాలి,చేస్తానూ అన్నా, తీరా దిగా ఆ సుడిగుండంలోపడి మునిగిపోతాడు దేశసేవమీద అంత ఉబలాటం ఉన్న దెవడూ ఆటిరాడుగదా. ఇహ, మూడ కొడుకు గట్టివాడే కాని, మరీ గట్టివాడు వాడు చెప్పినమాటలతో సుబ్బరాజుగా వ్యాపార జ్ఞాననేత్రం తెరుచుకుంది. అం ఫీల్డుండగా మనం ఊరికే ఉండటమేవి టని ఉత్సాహం కలిగి రాజకీయాల్లో ఆయనే దిగనిశ్చయించుకుని ఉంటాడు' అన్నాడు సుబ్బరాజు.

''మరి మూడోకొడుకు? వాడు స్తిమితంగా ఉంటాడా? చెప్పినట్టు వింటాడా?'

''దానికేముంది? వాడికి మంచి గడ సైన పిల్లని, చక్కనిదాన్ని తెచ్చి పెళ్ళి చేసేస్తాడు. స్విట్జర్లాండుకి హనీమూన తీసుకుపోతుందా పిల్ల" అన్నాడ సుబ్బరాజు.

